# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ హైదరాబాద్ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ లను కలిశారు.
- ❖ జాతీయ పంచాయతీ పురస్కారాలలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం సాధించడం పట్ల ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు.
- ❖ గిరిజన ప్రాంతాల ఆధ్యాత్మిక వైభవం, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.
- ❖ ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలియజేశారు.

=====================

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ లను ఈరోజు కలిశారు. తొలుత జూబ్లీహిల్స్‌లోని ఉప ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. సైనస్ సమస్య కారణంగా పవన్ కళ్యాణ్‌కు ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ ఇంటికి ప్రధానమంత్రి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు నివాసానికి వెళ్లారు.

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి ఉదయం 11 గంటల 30 నిమిషాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశం కానున్నారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తోనూ ముఖ్యమంత్రి సమావేశం అవుతారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, నిధులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించనున్నారు. మధ్యాహ్నం 3

గంటలకు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు చంద్రబాబు నాయుడుతో సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు భారత పరిశ్రమల సమాఖ్య బిజినెస్ సమ్మిట్ కు ముఖ్యమంత్రి హాజరవుతారు. అనంతరం ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ సహా నీతిఆయోగ్ సభ్యులతో ఆయన సమావేశం అవుతారు.

======================

జాతీయ పంచాయతీ పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం సాధించడం పట్ల ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ఈరోజు స్పందించారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే దృఢ సంకల్పంతో ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించడం గర్వకారణమని తెలిపారు.

======================

ఏక్ భారత్.. శ్రేష్ట్ భారత్.. కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థలో ఈనెల 15 నుంచి 27వ తేదీ వరకు 6వ దశ యువ సంగం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐటి డైరెక్టర్ కె.ఎన్. సత్యనారాయణ తెలిపారు. తిరుపతిలోని ఆకాశవాణితో ఆయన ఈరోజు మాట్లాడుతూ... విద్యార్థుల్లో మేధోసంపత్తిని పెంచే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నిర్వహిస్తోందని తెలిపారు. మహారాష్ట్ర నుంచి వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తిరుపతి ఐఐటికి ఈనెల 16వ తేదీన చేరుకుంటారని.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే విధంగా కార్యాచరణ రూపొందించామని ఆయన పేర్కొన్నారు.

======================

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరుడిని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ గ్యానేష్ కుమార్ ఈరోజు దర్శించుకున్నారు. ఆలయం వద్ద శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ కొట్టే సాయి ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గ్యానేష్ కుమార్ చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విరామం

======================

గిరిజన ప్రాంతాల ఆధ్యాత్మిక వైభవం, సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ముక్కువ మండలం శ్రీ శంబర పోలమాంబ గుడి మరమ్మత్తులు, అభివృద్ధి పనుల కోసం కోటి రూపాయల నిధులను మంజూరు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులపై ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... ఆలయ ప్రాంగణంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

======================

వ్యవసాయం, రైతు సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలో 5 కోట్ల 61 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకుందని తెలిపారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రంలో 1,679 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 17.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో లక్షా 67 వేల మంది రైతుల ఖాతాల్లో 3 వేల 870 కోట్ల రూపాయలు జమ చేశామని తెలిపారు.

======================

బీహార్ నుండి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కోస్తాంధ్ర తీరప్రాంతం వరకు ద్రోణి కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శ్రీలంక ప్రాంతాల్లో విస్తరించి ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. వీటి ప్రభావంతో కోస్తాంధ్రలో గురువారం వరకు, రాయలసీమలో మంగళవారం వరకు విస్తృతంగా పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

=====================

పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రేపు రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో  నిర్వహించనున్నట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌లో అన్ని మండలాల తహశీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లులు హాజరవుతారని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదు స్థితి తెలుసుకోవడానికి, ఇతర వివరాల కోసం 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

=====================

న్యాయ వ్యవస్థలు, బార్ అసోసియేషన్లు సమన్వయంతో పనిచేస్తూ.. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కోర్టు భవన సముదాయంలో నూతనంగా నిర్మించిన 14వ అదనపు జిల్లా స్పెషల్ కోర్టు, రెండో అదనపు సివిల్ జడ్జి మెజిస్ట్రేట్ కోర్టులను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ దేవానంద్ మాట్లాడుతూ.. కేసుల భారాన్ని తగ్గించేందుకు లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదపడతాయని, కక్షిదారులు వీటిని సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు ప్రోత్సహించాలని సూచించారు.

=====================
=====================